# సత్యవాక్యము

# the word of truth

క్రైస్తవ మాసపత్రిక

JUNE 1997

# 13వ ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

| | | |
|---|---|---|
| తేదీలు | : | **1997 డిశంబరు 7 నుండి 12 వరకు** |
| | | ఆదివారం నుండి శుక్రవారం వరకు |
| స్థలము | : | కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు |
| | | ఫోర్ట్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003. |
| ముఖ్యాంశము | : | "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" |
| **Theme** | : | **"Jesus Christ, the Son of God"** |

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్థన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.


నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884-63722

**Editor :** J.C.CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 జూన్ 1997 సంచిక 11


సంపాద కీయం

## మంచి వర్తమానము పంచుకొనడానికే

## ( Good News is for Sharing )

మాల్కమ్ మగ్‌రిడ్ అను బ్రిటీషు గ్రంధకర్త 'యేసు' అను తన పుస్తకంలో యిలా వ్రాసాడు: మానవజాతి చరిత్రయంతటిలోను యేసు ఈ లోకమునకు వచ్చిన సంఘటన అత్యంత బ్రహ్మాండమైనది. మానవుని జీవితములో శతాబ్దముల తరబడి పలుకుబడిని కల్గిన ఈయనవంటి వ్యక్తి మరొకడెవడును లేడు. సాధారణంగా మానవులు సంపాదించు విధముగా ఈయన తన ఘనతను సంపాదించలేదు. ఆయన రాజకీయ ఆందోళనలేమీ నడిపించలేదు., ఉద్రూతలూగించే ప్రసంగాలను చేయలేదు, ఆర్థిక పరమైన బలగం యేమీ ఆయనకు లేదు. ఆయన తన వర్తమానమైన ప్రేమ, పరిచర్యల ద్వారానే అందరికీ మేలు చేయుచు సంచరించుచు, జనసమూహములను ఆకట్టుకొనగల్గెను.

సింధియా పెర్ల్‌మాస్ అనునామె "ట్రిబ్యూట్ టు క్రైస్ట్" అను గ్రంధములో యిట్లు చెప్పెను: ఆయన ఒక మారుమూల గ్రామంలో, వ్యవసాయము చేసుకొనే

స్త్రీ కడుపున బిడ్డగా పుట్టెను. మనుష్యులు ద్వేషించు మరొక గ్రామంలో ఆయన పెరిగెను. ముప్పై సంవత్సరముల మట్టుకు వడ్లవాని వృత్తినాయన అవలంబించెను. అటు తరువాత మూడు సంవత్సరముల మట్టుకు సంచార సువార్తికునిగ తిరుగులాడెను, ఆయన ఎన్నడు ఒక గ్రంధమైనను వ్రాయలేదు. ఏ ఒక్క పదవి చేపట్టలేదు. ఆయనకొక యిల్లంటూ యేమీలేదు. కుటుంబమూ లేదు. కళాశాలలో విద్యనభ్యసించనే లేదు. పెద్దపట్టణాల్లో ఎక్కడా అడుగు పెట్టలేదు. తన శిశుదశలోనే తప్ప రెండువందల మైళ్ళకు మించి ఆయన ఎన్నడు ప్రయాణం చేయలేదు.

యేసుక్రీస్తుకు తాను తప్ప నిదర్శనాలు యేమీలేవు. ఆయన సువార్త పరిచర్య తొలుతలోనే ప్రజానాడి ఆయనకు వ్యతిరేకమయ్యెను. మూడు సంవత్సరముల పాటు బోధించుటతోనే ఆయన రాజకీయ నాయకుల యొక్కయు మత గురువుల యొక్కయు సమక్షమున తేబడెను. ఆయనను న్యాయస్థానమునకు ఈడ్చుకొని పోవుచుండగా ఆయన సన్నిహిత మిత్రులైన శిష్యులు ఆయనను విడనాడిరి. ఆయనకు అన్యాయపు తీర్పునిచ్చి, సిలువవేసి చంపుటకు తీర్పుచెప్పబడెను. ఆయనకున్న ఒకేఒక్క కుట్లులేని అంగీకొరకు రోమా సైనికులు చీట్లు వేసికొనవలసి వచ్చినది. అరిమతయి యోసేపు అనునొక మిత్రుని యొక్క అరువు సమాధిలో ఆయన పాతిపెట్టబడెను.

మూడు దినముల తరువాత ఆయన సమాధినుండి తిరిగి లేవగా, అది అన్నిరకములైన విద్యావేత్తలు పఠించదగు వర్తమానమయ్యెను. నిజానికి ఇరవై శతాబ్దముల తరువాత కూడ మానవజాతి యంతటికీ యేసే కేంద్రబిందువై, వారి యభివృద్ధికి నాయకుడై యున్నాడు.

సింధియా మాస్ ఇంకా ఇట్లు చెప్పింది: ఈలోకమందున్న సైన్యములన్నిటిని, నావికాదళములన్నిటిని, శాసనసభలన్నిటిని, పరిపాలించిన భూరాజులందరినీ ఏకము చేసి చూచిన, ఈ ఒక్క వ్యక్తివలె మానవజాతి నంతటిని మార్చగలిగిన వారెవరును లేరు.

యేసుక్రీస్తు యొక్క వర్తమానము అన్ని తరగతుల ప్రజలను ఆకర్షించుకొనెను: గలిలయ తీరముననున్న పల్లెవాని మొదలు, పాపములో పడిన స్త్రీ వరకు, నేర్పరి

మైన పరిసయ్యుని మొదలు పన్ను వసూలు చేయు సుంకరి వరకు ఆయన వర్తమానమునకు ఆకర్షితులైరి. ఆయన వ్యక్తిత్వము యొక్క సొగసు మన హృదయములను తాకుచు, ఈ ఇరవయ్యో శతాబ్దములో కూడా మననుండి గౌరవాన్ని పొందుచున్నది. యేసుయొక్క రాకడ పాతనిబంధనలోనే, మానవుడు మొదట పాపము చేయగా ప్రవచింపబడెను. మానవుడు అవిధేయతవలన దేవుని నుండి వేరుచేయబడెను. అప్పుడు స్త్రీ యొక్క సంతానము (అనగా కొన్ని శతాబ్దముల తరువాత రాబోవు క్రీస్తు) సర్పము యొక్క తలను చితుకగొట్టును (అనగా సాతానుని జయించును) అని వాగ్దానము చేయబడెను. అటు తరువాత అబ్రాహాము యొక్క సంతానము (అనగా క్రీస్తు) అన్ని జనాంగములకు ఆశీర్వాదముగా నుండునని చెప్పబడెను. యేసుయొక్క రాకడ ఆయాశీర్వాదమునను గ్రహించెను ఏలయనగా యేసు అందరి పాపముల నిమిత్తము తన ప్రాణమర్పించెను. పాతనిబంధన ప్రవక్తలు ఆయన మానవక్షితిజముపై ఉద్భవించి దేవుని ఆత్మీయ రాజ్యమైన సంఘమును స్థాపించు సమయమును గూర్చి ముందుగానే దైవిక బయల్పాటు వలన ప్రవచించిరి (దానియేలు 2:44).

ఆ రాజ్యములో స్త్రీ పురుషులందరు అలసిసొలసి తమ ఆత్మలకు విశ్రాంతి కనుగొందురు. మరియు తమ జీవితములనుండి పాపభారము తొలగించబడును. ఇరవై శతాబ్దముల తరువాత కూడ తమ ఆత్మల విశ్రాంతి స్థలముగా మానవులందరికి ఆయన ఒక్కడే యున్నాడు, మరియు వారు క్రీస్తుయేసు నందలి విశ్వాసమూలముగా దేవుని కుమారులగుదురు. ప్రగాఢ విశ్వాసము కలిగి ఆయనకు వారు లోబడుట ద్వారా విమోచింపబడుదురు.

ఆయన చుట్టూనున్న వారు ఆయన రాజ్యములో ఎవరు గొప్ప వారుగుదురో యని వాగ్వివాదము చేయుచుండగా, యేసు ఒక పళ్లెములో నీరు పోసి బూడిదె కొట్టిన వారి పాదములు కడిగెను. నిజమైన గొప్పదనము రాజ్యములో గొప్పస్థానము నలంకరించుటకు ఆశపడుటగాని, సన్నని నారబట్టలు ధరించుటలో గాని లేక లెక్కలేనంతమంది పరిచారకులను కలిగియుండుట గాని కాదని ఆయన స్పష్టము చేసెను. సరిగదా యితరులకు సేవ చేయుటలో నిజమైన గొప్పదనముండునని

ఆయన బోధించెను. "మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు అందరికి పరిచారకుడై యుండవలెనని" ఆయన బోధించెను. పసివారి నిష్కాపట్యంలో జ్ఞానమును, మానవుల అవివేకములో ఆత్మీయ సత్యములను ఆయన కనుగొనెను.

యేసు ఇంత విపులముగా బోధించినను, "ఒకడు క్రైస్తవుడుగా మాత్రమే ఎట్లుండగలడు?" అనే అంశము పై గొప్ప గందరగోళమున్నది. నేటి లోకములో 300 మతశాఖలున్నవి. వారిలో ప్రతిఒక్కరు రక్షణమార్గము తమయొద్దనే యున్నదని ఆరోపించుకొందురు. క్రీస్తుద్వారా దేవుని వెదుకుచున్న జనసమూహములు పాపము నుండి రక్షింపబడుటకున్న నిజమైన మార్గమును గూర్చి గజిబిజియగ్చు చున్నారు. ఆ మార్గము తెలుసని చెప్పుకొన్న అనేకులు బలము కొరకు, ఆధిక్యతకొరకు ఘనతకొరకు, ఆర్ధిక స్తోమత కొరకు పోరాడు కొనుచున్నారు. క్రీస్తు తన్నుతాను రిక్తునిగా జేసుకొని మానవుడైన విధముగా వారు తమ్మును తాము తగ్గించుకొనలేరు (ఫిలిప్పీ 2:7).

క్రీస్తు అనుచరులమని చెప్పుకొనువారిలో యున్న ఇట్టి గందరగోళ పరిస్థితిని బట్టి పరిశుద్ధమార్గమును కనుగొనుటలో కొందరు నిరాశజెందుచున్నారు. కొందర యితే బైబిలునొద్దకు, మరీ ముఖ్యముగా క్రొత్త నిబంధన యొద్దకు వెళ్లి క్రైస్తవుడగుటకు య్యేమి చేయవలెనని పరిశుద్ధాత్ముడు బోధించుచున్నాడో యని నిజముగా తెలిసికొన గోరుచున్నారు. ప్రపంచమందంతటా, ఇంచుమించు అన్ని దేశములలోను, విభాగింపబడిన మతసంస్థలలో యుండనక్కరలేకుండా ఒకడు క్రైస్తవునిగా యుండుట సాధ్యమేయని ప్రజలు గ్రహించుచున్నారు. క్రైస్తవ్యమని పిలువబడే దానిలో ఎక్కువ భాగం బైబిలుపై గాక మానవాభిప్రాయముల మీదనే ఆధారపడి యున్నది. ఇవ్విధముగా నిరాశజెందిన ప్రజలు నడిపింపుకొరకు నేరుగా క్రొత్తనిబంధన యొద్దకే వెళ్లిరి.

లేఖనముల యొద్దకు మరలుట వలన లక్షలాది ప్రజలు క్రీస్తుయొక్క పవిత్రమైన పిలుపునకు లోబడిరి. ఆయన యందున్న ప్రగాఢమైన విశ్వాసమును బట్టి, వారు తమ పాపముల విషయమై మారుమనస్సు బొంది, క్రీస్తే తమ ప్రభువని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడిరి. వారునూతన జీవము

పొంది నడచుకొనునట్లు దానినుండి లేపబడిరి (రోమా 6:3-4). అపో.కా.2వ అధ్యాయములో 3000మంది యొక్క మాదిరినే వారుకూడ అవలంబించిరి. మరియు ప్రభువు వారిని తన ఆత్మీయ రాజ్యములో, అనగా సంఘములో చేర్చెను. రక్షింపబడినవారై పరిశుద్ధాత్మ తమలో నివసించుచుండగా, దేవుని చిత్తానుసారముగా అనుదినం వారు జీవింతురు.

గలతీయ సంఘములో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు చెప్పెను: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27). క్రీస్తునందలి ప్రగాఢమైన నిలువరమయిన తమ విశ్వాసము వలనవారు ఇపుడు దేవుని కుమారులై యున్నారు. తత్ఫలితముగా దేవుని నుండి దూరము చేసిన పాపములనుండి విముక్తులై దేవుని యెదుట వారున్నారు. క్రీస్తులోనికి మార్పు చెందిన ఇట్టి ప్రజలు సమాజముగా కూడిరాగా వారు సంఘ మగుదురు. వారు పిలువబడిన వారు. సంఘమనగా అంధకార సంబంధమైన రాజ్యమునుండి వెలుగుసంబంధమైన క్రీస్తు రాజ్యములోనికి సువార్తవలన పిలువబడిన వారని యర్థము (కొలస్స 1:13).

ప్రపంచమందంతటా యిట్టి స్థానిక సంఘములు ఎన్ని యున్నవో మనకు తెలియదు గాని వారు 110 దేశములలో ఇప్పుడున్నారు. ఇంచుమించు 20వేల సంఘములు మట్టుకు ప్రపంచమందంతటా యున్నాయని, అందు ఇంచుమించు మూడుకోట్ల మంది సభ్యులున్నారని అంచనా వేయబడింది. అమెరికాలోని కొన్ని జిల్లాలలో మండలానికి వంద సంఘులున్నాయి. లాస్ఏంజిలిస్ అను ఒక్క పట్టణము లోనే 117 స్థానిక సంఘాలున్నాయి. టెక్సాస్‌లో హేరీస్ మండలములో 156 స్థానిక సంఘములున్నాయి. నైజీరియా దేశములో 2000 సంఘములున్నాయని అంచనా. క్రీస్తుచిత్తమునకు లోబడుచు ఆయన సంఘములో చేర్చబడుచున్నవారి సంఖ్య ఘనా, కెన్యా, దక్షిణాఫ్రికా మొదలగు దేశాలలో దినదినము విస్తరించు చున్నది. రెండవ ప్రపంచ యుద్ధమునకు ముందు భారతదేశములో అస్సాం రాష్ట్రములో ఖాసీ కొండజాతీయుల మధ్య ఇట్టి స్థానిక సంఘమొకటి స్థాపించబడెను.

1963లో ఈ పని మద్రాసుకు వ్యాపించెను. అప్పటినుండి ఈ ఉద్యమము భారతదేశములో ప్రతి రాష్ట్రానికి వ్యాపించుటయే గాక దాని పొరుగున వున్న ఐదు దేశాలకు విస్త రించెను. ఈ స్థానిక సంఘములన్నియు తమ్మును తాము క్రీస్తు సంఘములని పిలచుకొందురు. ఈ పేరును బట్టి వారొక మతశాఖయని గాక, వార క్రీస్తును మాత్రమే వెంబడించుటకు పిలువబడిన వారను గుర్తింపు కొరకు అట్లు పిలుచు కొందురు. మొదటి శతాబ్దములో సంఘమెట్లుండెనో అట్లేయుండుటకు నేటి సంఘమును పునరుద్ధరించుటకు వారు ఆసక్తి కలిగిన వారు.

ఇదొక వింతగా యుండవచ్చునేమో గాని ఈ సమాజముల వారందరికీ ఒక భూసంబంధ కార్యాలయము (Head Quarter ) లేదు. ప్రతి స్థానిక సంఘము మరొక స్థానిక సంఘమునుండి స్వయం ప్రతిపత్తి కలిగి యుండి, ఇహపరముల యందు సర్వాధి కారిగా క్రీస్తును మాత్రమే వారంగీకరింతురు. క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్యమైనసంఘము యొక్క విధులన్నియు క్రొత్తనిబంధనలో చెప్పబడినవి గనుక,ఈసంఘము లన్నియు క్రైస్తవ జీవనమునకు క్రొత్తనిబంధనయే మార్గదర్శి యని వారంగీకరింతురు. అట్లని వారు పాతనిబంధనను నిర్లక్ష్యము చేయరు. ఆదినుండి దేవుడు మానవునితో ఎట్లు సంప్రదించాడో మొదటి నిబంధన చెప్పును. దేవుడు తాను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలు ప్రజలతో మోషే ద్వారా క్రీస్తు వచ్చువరకు చేసిన ఒడంబడిక దానిలో యున్నది. క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు అది ఒక బాలశిక్షకుడని క్రొత్త నిబంధనలో చెప్పబడి యున్నది. వాగ్దానము చేయబడిన సంతతి (క్రీస్తు) వచ్చువరకు అతిక్రమముల వలన చేర్చబడిన మోషే ధర్మశాస్త్రము దానిలోయున్నది. (గలతీ 3:19). క్రీస్తు వచ్చినప్పుడు ధర్మశాస్త్రము నెరవేర్చబడెను మరియు క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములపై ఆధారపడిన క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చెను.

ఈ సంఘముల యొక్క ఆరాధన అంతయు మొదటి శతాబ్దపు క్రైస్తవారాధన మాదిరి యుండును. ఆరాధనలో వారు పాటలు పాడుదురు. ప్రార్థన చేయుదురు, వాక్యోపదేశము గావింతురు, ప్రభురాత్రి భోజనము నాచరింతురు మరియు కానుకలిత్తురు. వారు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొని దేవుని మహిమ పరచుతురు.

ఇట్టి క్రైస్తవులను గూర్చి నీవింకా తెలిసికొనగోరుచున్నావేమో! యేసుక్రీస్తు ద్వారా దేవుని సేవించాలని కోరుచున్నవారందరు, బైబిలు మాదిరి చొప్పున మార్పు జెందాలని, ఆరాధించాలని మా కోరికయై యున్నది. ఇట్లు చేయుటలో క్రీస్తునందు అందరు ఏకశరీరము కాగలరు. ప్రపంచమందనేక చోట్ల అనేకులు యిట్లు చేయు చున్నారు. అందువలన మీరు మా ఆరాధనలకు హాజరు కావలెనని ఆహ్వానించు చున్నాము. క్రీస్తు సంఘములు మీకు సాదరముగా స్వాగతము పలికెదరు. ఈ సంగతులు ధ్యానించుచుండగా దేవుడు మిమ్మును దీవించును గాక !

- రోజర్ పీటర్సన్, వేబర్న్, కెనడా.

కొండమీద ప్రసంగము-32

# నీ పునాది యేది ?

## ( WHICH IS YOUR FOUNDATION )

(మత్తయి 7:21-23)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగమును వచనముల వారీగ గత కొద్దిసంచికలలో ధ్యానించుచు వచ్చాము. ఈ రోజు ఆయన ప్రసంగము యొక్క ఆఖరి భాగాన్ని మనం చూచుకొందాము: ఆయన యిట్లు చెప్పాడు: "కాబట్టి యీనా మాటలు విని వాటి చొప్పున చేయుప్రతివాడును బండమీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వానకురిసెను. వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు యీనా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు యిసుక మీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వానకురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-27).

ఏ భవనమైనా దాని పునాది మీద ఆధారపడియుంటాది. మనలో

ప్రతివాడును తన జీవితం అనే భవనాన్ని నిర్మించుచునే యున్నాడు. యేసుప్రభువు మాటల ప్రకారము కొందరు బండమీద తమ పునాదిని వేయుచున్నారు. మరికొందరు యిసుక మీద కట్టుచున్నారు. ఏ పునాది మీద నిర్మించాలో ప్రతివాడు తనకుతానే నిశ్చయించుకొనును. ఒక వ్యక్తిఒకేసారి తన జీవితభవనాన్ని ఈ రెండింటి మీద నిర్మించలేడు. అనేకులు యిసుక మీద తమ పునాది వేయుచున్నారు గాని బండమీద నిర్మించువారు కొందరే.

ఈ రెండు రకాలైన వ్యక్తులలోను కొన్ని సంగతులు ఒకే రీతిగా యున్నట్లు మనం గమనించగలము. ఈ వ్యక్తులు మానవులే అయినను వారికిద్దరికి ఇయ్యబడిన హెచ్చరికలు, ఆదేశాలు ఒక్కటే. నిర్మించుటలో వీరిద్దరు కొంత సమయాన్ని వినియోగించారు. వీరిద్దరు నిర్మించడానికి చాల ఆతురత పడినవారే. వీరిద్దరు తమ శక్తిని, ధనాన్ని వినియోగించారు. మరియు వారి జీవితకాలములోనే తమ జీవిత భవనాన్ని ముగించారు. మిగతా మానవులకు ఈ రెండు భవనాలు ఒకేలాగున కనబడతాయి. మరియు ఈ రెండింటికి సంభవించే పరీక్ష ఒక్కటే.

అది అట్లుండగా ఈ రెండు భవనములు నిర్మించిన వారిలో కొన్ని తేడాలు లేకపోలేదు. ఒకడు యేసుప్రభువు చెప్పిన మాటలు విని వాటి చొప్పున చేసాడు. గనుక అతడు బండమీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుడయ్యాడు. మరొకడు కూడ యేసుప్రభువు మాటలను విన్నాడు గాని వాటి చొప్పున చేయలేదు. గనుక అతడు యిసుక మీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలినవాడయ్యాడు. బండమీద తనయిల్లు కట్టుకొనిన వాడు తీర్పులో నిలబడతాడు. నిత్యము దేవునితో జీవిస్తాడు. అయితే యిసుక మీద తన యిల్లు కట్టుకొనిన వాడు తీర్పులో పడిపోతాడు; నిత్యనరకములో పడవేయబడతాడు గనుక అతని పాటు గొప్పది.

అందువలన మనము నరకమును తప్పించుకొని పరలోకములో ప్రవేశించాలంటే, మనం ఈ లోకంలో జీవించియుండగానే యేసుప్రభువు మాటలకు లోబడి జీవించాలి. ఈ లోకంలో జీవించుచున్న ప్రతివాడు కనీసం నాలుగు విధాలుగా తన జీవిత భవనాన్ని నిర్మించాలని, ఇందులో ఏదో ఒకదానిపై ఆధారపడి నిర్మించాలని

ప్రయత్నం చేయుచున్నాడు. అవి 1. మానవజ్ఞానము, 2. మానవ అనుభవము, 3.మానవుని భావాలు, 4. విశ్వాసము అనునవి.

అనేకులు తమ సొంత జ్ఞానమును బట్టి మాత్రమే తమ జీవితాన్ని జీవించ నెంచుకొంటారు. మానవ జ్ఞానం మంచిదే. గాని అది ఒక్కటే మనలను నిత్యజీవానికి నడుపలేదు. మానవుని జ్ఞానంలో దేవునికి చోటు లేకపోతే అట్టివాని జీవితం ప్రమాదకరం. అందుకే భక్తుడైన యాకోబు ఇట్లనుచున్నాడు : "మీలో జ్ఞానవివేకములు గలవాడెవడు ? వాడు జ్ఞానముతో కూడిన సాత్వికము గలవాడై తన యోగ్యప్రవర్తన వలన తన క్రియలను కనుపరచవలెను. అయితే మీ హృదయములలో సహింపనలవి కాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన వారైతే అతిశయపడవద్దు, సత్యము నకు విరోధముగా అబద్ధమాడవద్దు. ఈ జ్ఞానము పైనుండి వచ్చునది కాక భూసంబంధ మైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిది యునై యున్నది" (యాకోబు 3:13-15).

అపొ.పౌలు ఇట్లనుచున్నాడు: "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనము గాని, రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి.... దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగ కుండినందున సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను" (1కొరింథీ. 1:18-21). "అయితే పైనుండి వచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది, తరువాత సమాధాన కరమైనది, మృదువైనది, సులభముగా లోబడు నది, కనికరముతోను మంచి ఫలముతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేష ధారణయైనను లేనిదియునైయున్నది" (యాకోబు 3:17). దేవుని జ్ఞానముపై గాక తన స్వజ్ఞానముపై ఆధారపడి జీవించువాడు యిసుక మీద తన యిల్లు కట్టు కొనిన బుద్ధిహీనుని పోలినవాడే.

తరువాత, మానవానుభవంపై ఆధారపడి తమ ఆత్మీయ జీవితాన్ని నిర్మించువారు కొందరున్నారు. మానవానుభవం ఏమంత సరియైనది కాదు. ప్రవక్తయైన యిర్మీయా ఇట్లనుచున్నాడు: "యెహోవా తమ మార్గము నేర్పరచుకొనుట నరులవశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున

ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మియా 10:23). మరలా ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామె 14:12; 16:25). మానవానుభవం కూడ యిసుక మీద వేసిన పునాది లాంటిదే.

తరువాత మన మనోభావాలను బట్టి ఆత్మీయ జీవితం జీవించడం ఏమంత మంచిది కాదు. మనోభావాలు ఎంతమంచి వైనను, నిత్యత్వం కొరకు నిర్మించుటలో అవి సరియైనవి కావు. ఏలయనగా మనభావాలను బట్టి మనం మోసగించబడిపోతాం. ఇస్సాకు తన కుమారుడైన యాకోబు వలన మోసగించబడ్డాడు. తన వృద్ధాప్యంలో యాకోబును ఏశావని భావించి అతని దీవించాడు. అట్లే యాకోబు కూడ తాను ప్రేమించిన యోసేపు నిజంగా చనిపోయాడని భావించి దుఃఖించాడు. అయితే యోసేపు మరణించలేదుగాని బ్రతికేయున్నాడు.

అలాగే పౌలు కూడ క్రైస్తవులను హింసించుచున్నప్పుడు తాను మంచినే జరిగించుచున్నానని తలంచాడు. అతడు మంచి మనస్సాక్షితో అట్టి హింసను జరిగించినను దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించాడని తరువాత తెలిసికొన్నాడు (అపో.కా. 23:1). మనస్సాక్షి మంచిదేగాని, అది దేవుని చిత్తానికి భిన్నముగా యున్నప్పుడు పౌలువలె మార్పు నొందుటకు నడిపించకపోతే, యిసుకమీద కట్టుకొనిన బుద్ధిహీనుని పోలినట్లే నీ జీవితముండును.

మనం మానవ జ్ఞానమును బట్టి గాని, అనుభవాన్ని బట్టిగాని, భావాలను బట్టిగాని గాక, మన జీవితాన్ని విశ్వాసమును బట్టి నిర్మించుకోవాలి. ఏలయనగా విశ్వాసము లేకుండ ఎవడును దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). ఈ విశ్వాసము దేవుని వాక్యమును వినుట వలన గాని, చదువుట వలన గాని వచ్చును (రోమా 10:17; యోహాను 20:30,31). యేసుప్రభువు చెప్పిన మాటలను విని వాటి చొప్పున చేయుటవలన మన విశ్వాసము నిరూపించబడును. ఆయన మాటలను విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. అట్టివాడు తీర్పుదినమున నీతి మంతుడని యెంచబడును.

దేవునికిష్టులుగా జీవించిన వారందరు విశ్వాసమనే పునాది మీదనే తమ ఆత్మీయ జీవితాలను నిర్మించుకొన్నారు. దేవుడు నోవహును ఒక ఓడ నిర్మించుమని చెప్పినప్పుడు అతడు మానవ జ్ఞానము, అనుభవము, మనోభావాలపై గాక విశ్వాసముపై ఆధారపడి ఆ ఓడను నిర్మించాడు. అబ్రాహామును దేవుడు పిలిచినప్పుడు విశ్వాసము వలననే అతడాయనను వెంబడించాడు. క్రీస్తుయొక్క అపొస్తలులందరు విశ్వాసముపై ఆధారపడి సువార్తను ప్రకటించారు. తమ ప్రాణాలు ఈ లోకంలో కోల్పోయినా పరలోకాన్ని సాధించుకోగలిగారు. ఈనాడు నీవు కూడ యేసుప్రభువునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుడవు కాగలవు !

- జాషువా గూటం.

## దైవ చట్టము

నేడు క్రైస్తవులు పాత నిబంధనను అనుసరించవలెనా ? లేక క్రొత్తనిబంధనను అనుసరించవలెనా ? ఈనాడు మనము ఏ చట్టమునకు బద్ధులై యుండవలెను ? అనేకులను పట్టి పీడిస్తున్న సమస్య ఇది. దేవుని వాక్యమును జాగ్రత్తగా పఠించి అర్థం చేసుకొన్నచో ఈ ప్రశ్న ఉద్భవించదు.

ఐగుప్తు దాస్యమునుండి తన ప్రజలను విడిపించే ప్రయత్నంలో దేవుడు మోషేను వారికి నాయకుడిగా ఎంపిక చేశాడు. పలు ప్రయత్నాల తరువాత చివరకు రాజైన ఫరో ఇశ్రాయేలీయులను ఐగుప్తు విడిచి వెళ్ళనిచ్చాడు. ఎర్ర సముద్రం దాటి ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతం చేరుకున్నారు. దేవుడు వారితో మాట్లాడిన విధం చూస్తే "నీ దేవుడైన యెహోవాను నేనే, నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని (నిర్గమ 20:2). దేవుడు ఇక్కడ ఎవరితో మాట్లాడినది గమనించుట ముఖ్యము. ఐగుప్తు దాస్యము నుండి విడుదల చేయబడ్డ ఇశ్రాయేలీయులతో మాటలాడెను. ద్వితీయోపదేశకాండము 5:1-4 చదివినట్లయితే మోషే ఎవరిని ఉద్దేశించి మాట్లాడినది తెలియగలదు. "మోషే

ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను : ఇశ్రాయేలీయులారా! మనదేవుడైన యెహోవా హోరేబులో మనతో (ఇశ్రాయేలీయులతో) నిబంధన చేసెను-మన పితరులతో కాదు-నేడు యిక్కడ సజీవులై యున్న మనతోనే"- పై వాక్యములను పరిశీలిస్తే పాత చట్టము కేవలము ఇశ్రాయేలీయులకు మాత్రమే వొసంగబడినది కానీ యావత్ మానవవాళికి కాదు.

యిర్మియా గ్రంథము 31:31లో దేవుడు తన ప్రజలకు నూతన నిబంధన ఇవ్వనైనున్నట్టు వాగ్దానము చేసెను. అది పాతనిబంధన వంటిది కాదు. "..... ఇశ్రాయేలు ఇంటి వారితోనూ, యూదా ఇంటివారితోనూ నేను క్రొత్త నిబంధన చేయుదును" (హెబ్రీ 8:8). ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది. (హెబ్రీ 8:13). పాతనిబంధన దాని కార్యమును నెరవేర్చినది.

అపొస్తలుడైన పౌలు ఎఫెసీ సంఘమునకు వ్రాయుచు "ఆయన మన సమాధానమై యుండి మీకును మాకును ఉండిన ద్వేషమును అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రము (పదిఆజ్ఞలు) ను తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను.- ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు" (ఎఫెసీ 2:14-16). పాతనిబంధన లేక చట్టము దానికి సంబంధించి చెక్కబడిన ప్రతి ఆజ్ఞలను ఆయన తొలిగించి యున్నాడు ((2కొరింథీ 3:6,7). పౌలు రోమా సంఘమునకు లేఖ వ్రాయుచు "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" (రోమా 10:4). ఆత్మ[illegible] పౌలు పలికిన దానిని బట్టి పాతనిబంధన పాతగిలినది. దానిని ఆచరింప ప్రయత్నించువారు దేవుని వాక్యమును అబద్ధీకము చేయుచున్నారు. "దేవుడు వ్రాత పూర్వకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాన్నిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డములేకుండా దానిని ఎత్తివేసి...." (కొలొస్సయి 2:13-15).

పాతనింబంధన ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇవ్వబడినది కాని అన్యులకు కాదు. పౌలు చెప్పిన ప్రకారము" క్రీస్తు దానిని తొలగించెను - మేకులతో సిలువకు కొట్టెను" (కొలస్స 2:14). కాబట్టి క్రైస్తవులు పాత నిబంధనకు బద్ధులు కారు. క్రీస్తు మనకు మధ్యవర్తిగా నుండి నొసంగిన నూతన నిబంధనకు బద్ధులై యున్నారు. "ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనముల కలుగుటకై ఆయన (క్రీస్తు) మరణము పొందినందున పిలువబడిన వారు (క్రైస్తవులు) నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానము పొందు నిమిత్తము ఆయన (క్రీస్తు) క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు (హెబ్రీ 9:15).

క్రీస్తు సిలువ మరణము పొందువరకు క్రొత్తనిబంధన ఆచరణలోనికి రాలేదు. ఆయన మరణ-పునరుత్థానముల పిదప మొదటి పెంతెకోస్తు నాడు ఈ నిబంధన లేక చట్టము ఆచరణలోనికి వచ్చినది. ఆనాడే అపొస్తలులు దేవుని రాజ్యతాళములను తెరచి నూతన నిబంధనను ఆచరింప ప్రజలకు బోధించారు.

ప్రియచదువరీ ! దేవుని వాక్యము సంపూర్ణమైనది. (2తిమోతి 3:16,17). సత్యస్వరమును విని క్రీస్తు మార్గమును అనుసరించి జీవితము ధన్యము చేసుకో!

ఆర్. చెఖెసాంగ్, నాగాలాండ్.

## పెద్ద కుమారుడు
## ( The Elder Son )

అతడు ఎనలేని అందముతో జన్మించాడు. అతని జననము అతని తల్లిదండ్రులకు గొప్ప ఆనందము తెచ్చెను అనుటలో సందేహము లేదు. రూబేను వలె అతని తండ్రికి అతడు పెద్దకుమారుడు. "రూబేనూ, నీవు నా పెద్ద కుమారుడవు. నాశక్తియు నాబలము యొక్క ప్రథము ఫలమును నీవే" (ఆది 49:3). వారి తల్లిదండ్రులకు అతని బాల్యదినములు ఎడతెగని ఆనందము కలుగజేసెను అనుటలో సందేహములేదు. అతని చిరునవ్వు, అతని చేష్టలు, అతని మాటలు, అతని వేడక వారిని పులకింప చేసి యుండవచ్చు.

రెండవ కుమారుని యొక్క జననము వారి ఆనందమును రెండింతలు

చేసింది. అంతే కాకుండా మొదటి కుమారునికి సహోదరత్వములో ఉన్న ఆనందాన్ని తెలిసికొనగలడు.

యుక్త వయస్సుతో పాటు స్వేచ్ఛ రావడంతో ఫలితంగా విపత్కర పరిస్థితులు కలుగును. కుటుంబముతో విసుగుచెంది, మరి ఎక్కువైన ఆనందకరమైన జీవితమును అనుభవించవలెననుడి కోరికతో చిన్న కుమారుడు తన పిత్రార్జితములో తన భాగమును ఇమ్మని అడిగెను. " ఆచిన్న కుమారుడు సమస్తమును కూర్చుకొని దూరదేశమునకు ప్రయాణమై పోయి అచ్చట తన ఆస్తిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను" (లూకా 15:13). పాపపు ఆనంద ఫలితముగా దారిద్ర్యము ఆకలిబాధ వేగముగా కలిగెను. అపుడు తండ్రి ప్రేమ మరియు కుటుంబమును గూర్చిన ఆలోచనలు అతని హృదయంలో ప్రవేశించెను. ఆ దూరదేశమును వదలి దైవ సంబంధమైన దుఃఖముతో పశ్చాత్తాపముతో తన తండ్రి ఇంటికి ప్రయాణము సాగించెను. వాడింక దూరముగా ఉన్నపుడు తండ్రి వానిని చూచి కనికరపడి అతని క్షమించి అతనిని కౌగలించుకొనెను. అక్కడ వాతావరణమంతయు విందుతోను మరియు ఆనంద ధ్వనులతోను నిండి యుండెను.

తన తమ్ముడు వచ్చిన సంగతి తెలిసికొని పెద్ద కుమారుడు తండ్రి ఎంత బతిమాలినను అతడు ఆ విందులో పాల్గొనుటకు నిరాకరించెను. మరియు తనపై తనకు తాను సానుభూతి కనుపరచుకొనెను. అతని ఎనలేని అందము యొక్క స్థానమును పాపమనెడు అందవికారము ఆక్రమించినది. సహోదర ప్రేమ స్థానములో తిరస్కారము ఆక్రమించినది. చిన్నతనములో తల్లిదండ్రులయొక్క సంతోష స్థానములో దుఃఖము నిరాశా నిస్పృహలు చోటు చేసుకొన్నవి.

పెద్దకుమారుడు ఈ క్రింది విధమైన మిషతో నిండియున్నాడు.

1. స్వనీతి :- తన్నుతాను మెచ్చుకొంటూ తన తమ్ముని పై నిందమోపుచుండెను. అతని ఉద్దేశము ప్రకారము అతడు చేయునదంతయు సక్రమముగా చేయుచున్నానని తలంచుచున్నాడు. ఈ విధముగా చెప్పుచున్నాడు: "అందుకతడు తన తండ్రితో-ఇదిగో ఇన్ని ఏండ్లనుండి నిన్ను సేవించుచున్నానే నీ ఆజ్ఞను నేనెన్నడును మీరలేదే" అని చెప్పుచున్నాడు (లూకా 15:29).

కృపకు దూరమైన జీవిత కల్పన అని అది నిజమైన జీవితము కాదని అతడు గుర్తించలేకపోయెను. మానవుని ఉనికి అంతా నేరుగా కృపతో సంబంధాన్ని కలిగియున్నది. ఆయన మానవుని ఎడల ఎడతెగని కృప చూపుచున్నాడు. "అయినను ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన ఋతువులను దయచేయుచు ఆహారమును అనుగ్ర హించుచూ ఉల్లాసముతో మీ హృదయములను నింపుచున్నాడు" (లూకా 14:17). ఆయన కృప మానవుని శాశ్వత ఋణస్తునిగా చేయుచున్నది.

విచారకరమైన సంగతేమనగా పెద్దకుమారుడు కృపయొక్క అవుసరతను గుర్తించలేదు. దేవుని యొక్క కృప కంటె మానవుని యొక్క యోగ్యతా సూత్రాలపై అతని జీవితము ఆధారపడినది. అతడు తనను తాను సమృద్ధికలవానిగా తలంచుకొనుచున్నాడు. అతడు గర్వము గలవాడు డంబములు చెప్పుకొనువాడు.

2. కృతజ్ఞత లేనివాడు (కృతఘ్నుడు) :- "అతని యొక్క తండ్రి తన ఆస్థిని పంచిపెట్టెను" లూకా 15:13. పెద్దకుమారునిగా అతని తండ్రి యొక్క ఆస్థితో రెండింతలు భాగమును అతడు పొందెను. అతని తండ్రి ఈలాగు గుర్తు చేసెను. "నాకున్నదంతయు నీదే" (లూకా 15:31), అయినప్పటికి తన తండ్రి ప్రేమను గాని, కనికరమునుగాని గ్రహించే జ్ఞానము అతనికి లేదు. అతని తండ్రి ఆస్థి అంతయు అతని ముందున్నది కాని అతని యొక్క చింత ఏమనగా అతడు పొందవలసిన దానిని పొందలేక పోయానే అని. "అయినను నా స్నేహితులతో సంతోషపడునట్లు నీవు నాకెన్నడును ఒక మేకపిల్లనైనను ఇయ్యలేదు" (లూకా 15:29). కృతజ్ఞత తెల్పుటకు బదులుగా ఎందుకు చేయలేదు.....? అని అనుచున్నాడు.

3. కఠిన స్వభావము (కాయగాచిన స్వభావము) :- అతని సహోదరుని యొక్క పశ్చాత్తాపము మరియు తండ్రి ప్రేమను తిరిగి పొందుటను గూర్చి తెలిసి కొనుట తప్ప మరి ఏ వర్తమానమును పెద్దకుమారునికి తెలియరాలేదు. ఆనందబాష్పాలు అతని చెక్కిళ్ళపై ఇంకుటకు బదులుగా మరియు

ప్రేమతో కృతజ్ఞతలు అతని పెదవుల వెంట వచ్చుటకు బదులుగా కోపము మరియు కఠినత్వము అతనిలో చోటుచేసుకొన్నది (లూకా 15:28-30).

పాపము కఠినపరచును. "కోపము పుట్టించినప్పటివలె మీ హృదయములను కఠినపరచుకొనకుడని ఆయన చెప్పెను కనుక పాపమువలన కలుగు భ్రమ చేత మీలో ఎవడును కఠిన పరచబడకుండునట్లు-నేడు అనబడు సమయ ముండగానే ప్రతిదినము ఒకనినొకడు బుద్ధి చెప్పుకొనుడి" (హెబ్రీ 3:13-15). పాపము, కనికరమును, ఇంద్రియనిగ్రహమును మృదువైన స్వభావమును నాశనము చేస్తుంది. పెద్దకుమారుని యొక్క స్వభావము పాపము యొక్క వినాశనమువల్ల కఠినపర్చబడినది.

తల్లిదండ్రులు ఒకే విధమైన బోధను తర్ఫీదును తమ కుటుంబములోని పిల్లలందరికి ఇచ్చినప్పటికి దేవుని గూర్చిన ఆలోచన మరియు ఆత్మసంబంధ మైన విషయములను గూర్చిన అవగాహన అందరిలోను ఒకే విధముగా ఉంటాయనే అభయములేదు. ఇశ్రాయేలు దేవుని ప్రథమ కుమారుడు (నిర్గమ 4:22). దేవుడు పరిపూర్ణ తండ్రి ఆయన తన కుమారుని దైవ చిత్తానుసారమైన సత్యసూత్రములను మరియు నీతిని వారికి బోధించి తర్ఫీదు నిచ్చినప్పటికి అతడు విధేయత మరియు అణకువ కల్గిన కుమారుడను నమ్మకము లేదు. అందుచేత యెహోవా ఈలాగునుచున్నాడు: "నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని వారు నా మీద తిరుగబడి యున్నారు" (యెష 1:2).

పాపము మరియు అవమానమను మార్గములో తమ చిత్తానుసారముగా ప్రవర్తించు పిల్లల విషయమై విశ్వాసులైన తల్లిదండ్రులపై నిందమోపరాదు

ఫ్రాంక్ చెస్సర్. ( VOT )

## సోమరి తనము

సోమరితనము అనగా పనిచేయుటకు బద్దగించుట లేక పని చేయుటకు ఇష్టపడకపోవుట. కాని ప్రతివ్యక్తి పని చేయడము న్యాయ సమ్మతమైన కనీస బాధ్యత.

ఏ పని లేకుండ జీవించు జీవితము అర్ధంలేని వ్యర్ధమైన జీవితము. జీవితానికి ఏదైన లక్ష్యం లేక గమ్యం ఉందనుకుంటే ఆ లక్ష్యం సాధించాలంటే కష్ట పడి పనిచేయుట వలననే సాధ్యపడుతుంది. మనము చేరవలసిన గమ్యం దగ్గరకు చేరుటకు కూడ కృషి సల్పడం మరియు కష్టించి పని చేయడము వలన మానవ శరీరము సక్రమంగా అభివృద్ధి చెందుతుంది. మానసికంగా ఉల్లాసము, సరియైన ప్రవర్తన సమాజములో గౌరవము లభిస్తుంది. సంతోషంగా జీవించుటకు పని చేయడము ఒక సాధనము. పని చేయడానికి అవకాశము, అర్హత మానవాళికి దేవుడిచ్చిన ఆశీర్వాదము.

అందుకే జ్ఞానియైన సొలోమోను ఈ విధంగా వ్రాసాడు: "మరియు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితము వలన సుఖమనుభవించుట దేవుడిచ్చిన బహుమానమే అని తెలిసికొంటిని" (ప్రసంగి 3:13). మరియు అపొస్తలుడైన పౌలు-ఎవడైనను పని చేయనొల్లని యెడల వాడు భోజనము చేయ కూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా ! (2థెస్స 3:10). "పని చేయువానికి జీతము ఋణమే గాని దానమని యెంచబడదు" (రోమా 4:4).

అందుకే మానవుడు అనే యంత్రము సరియైన రీతిలో అనగా సక్రమంగా నడుపుటకు ఉపయోగించే ఇంధనం లాంటిది పని. క్రమంగా, నమ్మకంగా పని చేయడము వలన జీవితము భౌతికంగా, మానసికంగా ఆరోగ్యంగా, ఆనందముగాను ఉంటుంది. శాస్త్రజ్ఞుల అంచనాల ప్రకారము చాలమంది తమ సామర్ధ్యములో కేవలము 10వ వంతు మాత్రమే పనిచేయుటకు ఉపయోగిస్తున్నారట.

మానవుని మేధస్సు ఉపయోగించకుండ ఉన్నట్లైతే అది కొద్ది కాలములోనే ఆలోచన శక్తిని కోల్పోతుంది, విడువబడిన ఇల్లు శిధిలమైనట్లు. అందుకే ఒక వ్యక్తి పనిలో నిమఘ్నమైనట్లైతే అనేకమైన చెడు ఆలోచనల నుండి శోధనల నుండి తప్పించుకొనగలడు. సామెతల గ్రంధకర్త ఇలా వ్రాసాడు: "పనిలో జాగు చేయువాడు నష్టము చేయువానికి సోదరుడు" (సామె 18:9). అందుకే యేసుప్రభువు ఒక తలాంతు పొందినవాన్ని ఉద్దేశించి "సోమరివైన చెడ్డదాసుడా".... అని సంబోదించారు. ఎందుకనగా అతడు తాను పొందిన సొమ్మును అభివృద్ధి చేయలేకపోయాడు

మత్తయి 25:26); ఇంకొక గుంపునుద్దేశించి - "ఇక్కడ దినమంతయు మీరెందుకు ఊరకనే నిలిచియున్నారని వారినడుగగా" (మత్తయి20:6). అనగా ప్రతివాడు పని చేయాలని దేవుని ఉద్దేశము అంతేకాని పని చేయకుండ లక్షలు సంపాదించి హాయిగా జీవించుచు శారీరకంగా, ఆత్మీయంగా నశించి పొమ్మనికాదు.

అందుకే ఆది మానవుడైన ఆదామునుద్దేశించి ప్రయాసముతోనే దినము లన్నియు దాని పంట తిందువు; ......... నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమటకార్చి ఆహారము తిందువు అని దేవుడు చెప్పెను. "మీలో కొందరు ఏ పనియు చేయక పరుల జోలికి పోవుచు, అక్రమముగా నడుచు కొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట వారిని ఆజ్ఞా పూర్వకముగా హెచ్చరించుచున్నాము" (2థెస్స 3:11-12).

"సహోదరులారా, మీరు ప్రేమయందు మరి ఎక్కువగా అభివృద్ధినొందు చుండవలెననియు, సంఘమునకు వెలుపటి వారియెడల మర్యాదగా నడుచుకొనుచు మీకేమియు కొదువ లేకుండునట్లు మేము మీకు ఆజ్ఞాపించిన ప్రకారము మీరు పరుల జోలికి పోక, మీ సొంత కార్యములను జరుపుకొనుట యందును, మీచేతులతో పని చేయుట యందును ఆశకలిగి యుండ వలెననియు, మిమ్మును హెచ్చరించు చున్నాము" (1థెస్స 4:12).

"అపవాదికి చోటియ్యకుడి; దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగల వానికి పంచిపెట్టుటకు వీలు కలుగునిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను" (ఎఫెసీ 4:27-28). పై లేఖనములను పరిశీలించగా ప్రతివారు తమ చేతులతో పనిచేయవలెనని నిర్దేశించబడినది. క్రైస్తవులమైన మనము పరుల జోలికి పోకుండ ఏదో ఒక పని కలిగి యుండవలెను. సొలొమోను చెప్పినట్లు "ఏకష్టము చేసినను లాభమే కలుగును వట్టి మాటలు లేమిడికి కారణములు" (సామె 14:23). "సోమరి వాని నేను దాటి రాగా తెలివిలేని వాని ద్రాక్షతోట నేను దాటిరాగా ఇదిగో దానియందంతట ముండ్లతుప్పలు, బలిసియుండెను. దూలగొండ్లు దాని కప్పియుండెను దాని రాతిగోడపడియుండెను. నేను దాని చూచి యోచన చేసి

కొంటిని. దాని కనిపెట్టి బుద్ధి తెచ్చుకొంటిని. ఇంక కొంచెము నిద్ర యింకకొంచెము కునుకుపాటు పరుండటకై యింకకొంచెము చేతులు ముడుచుకొనుట. వీటివలన నీకు దరిద్రత పరుగెత్తి వచ్చును ఆయుధస్థుడు వచ్చినట్లు లేమి నీ మీదికి వచ్చును " (సామె 24:30-34). "సోమరి తనము చేత ఇంటికప్పు దిగబడి పోవును, చేతుల బద్ధకము చేత ఇల్లు కురియును" (ప్రసంగి 10:18). ప్రతివారు తమ సొంత కార్యములయందు ఆసక్తి కలిగి యుండవలెను. నీవు ఒకవేళ ఉపాధ్యాయుడవైతే, పాఠములు చెప్పుట యందును, వడ్రంగివైతే చెక్కసామానులు చేయుటయందును, సువార్తికుడవైతే సువార్త చాటించుటయందు, క్రైస్తవుడవైతే సత్‌క్రియల యందు, ప్రభువు మహిమ పరచబడునట్లు, తండ్రివైతే కుటుంబ పోషణయందు, కుమారుడవైతే తల్లిదండ్రులయందు, పెద్దలను గౌరవించి, విద్యాభ్యాసము చేయుటయందును ఆసక్తి కలిగి యుండుట ఇలా అనేక రకముల పనులు కలిగియుండి సక్రమముగా తమ తమ బాధ్యతను నిర్వర్తించుటలో ఆసక్తిని కనపరుచుటవలన ఇటు స్వంతానికి అటు సమాజానికి భారము కాకుండ, ఈ లోక మాలిన్యము మనకు అంటకుండ అన్యుల మధ్య మన దేవుడు దూషింపబడకుండ ఉండాలని దేవుడు తన వాక్యము ద్వారా నిన్ను, నన్ను హెచ్చరించుచున్నాడు.

"తన భూమిని సేద్యపరచుకొనువానికి ఆహారము సమృద్ధిగా కలుగును" (సామె 12:11). "శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు సోమరులు వెట్టిపనులు చేయవలసి వచ్చును" (సామె 12:2).

"సోమరీ చీమల యొద్దకు వెళ్లుము వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము. వాటికి న్యాయాధిపతి లేకున్నను పై విచారణ కర్తలేకున్నను అవి వేసవి కాలమందు ఆహారము సిద్ధపరచుకొనును. కోతకాలమందు ధాన్యము కూర్చుకొనును. సోమరీ ఎందాక నీవు పండుకొని యుందువు ?ఎప్పుడు నిద్రలేచెదవు ? ఇక కొంచెము నిద్రించెదనని కొంచెము కునికెదనని కొంచెము సేపు చేతులు ముడుచుకొని పరుండెదనని నీవనుకొనుచుందువు. అందుచేత దోపిడి వచ్చునట్లు దారిద్ర్యము నీ యొద్దకు వచ్చును (సామె 6:6-11).

ఇంతవరకు పైనుదహరింప బడిన లేఖనముల సారాంశము: మొదట

మనిషిగా ఆ తర్వాత క్రైస్తవుడుగా ప్రతిఒక్కరు తమ తమ పనులు చేయవలసిన వారమై ఉంటున్నాము. ఇందులో ఏ బేధములేదు. అయితే క్రైస్తవులు ఆత్మీయంగా కూడ ఈ లోకములో జీవనము కొనసాగించవలసిన వారైయున్నారు. అందుకే ప్రతివారిని తన ద్రాక్షతోట అనే సంఘములో పని చేయుటకు దేవుడు పిలుచు చున్నాడు. తద్వారా అనేకులు రక్షణలోనికి నడిపించబడి సంఘము దినదినము అభివృద్ధి చెంది, తనను మహిమ పరిచే సంఘముగా ఉండాలని దేవుడు కోరు కుంటున్నాడు.

క్రైస్తవుడుగా ఒకడు ఇంకొక ఆత్మను రక్షించుటకు ఉపయోగపడకుండ తన ముట్టుకు తాను జీవించడము కూడ దేవుని దృష్టిలో సోమరితనమే, అందుకే సోమరివైన చెడ్డదాసుడా అని సంబోధించాడు. ప్రతి క్రైస్తవుడు సంఘ క్షేమాభివృద్ధికి ఆత్మల రక్షణార్థం ఆసక్తితో పని చేయవలయును.

"యెహోవా కార్యమును అశ్రద్ధగా చేయువాడు శాపగ్రస్తుడగును గాక ... (యిర్మీయా 48:10). "అందరును తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు" (ఫిలిప్పీ 2:21).

ప్రియ సహోదరులారా! మనము మన సొంత కార్యములను మాత్రమే కాక యేసుక్రీస్తు కార్యములను తప్పకుండ జరిగించవలసిన వారమై యున్నామని మరచి పోకూడదు. సంఘములో బైబిల్ చదువుట యందు, చందా ఇచ్చుటయందు, ప్రభువుబల్లను సమీపించుటయందు, రోగులను దర్శించుటయందు వెనుకబడి యున్నామేమో మనలను మనమే విమర్శించుకొనవలెను. ఇవి అన్నియు కూడ మన నిర్లక్ష్యానికి సూచనలు,

ఈ లోక రీతిగా మనము మన కుటుంబాభివృద్ధి కొరకు ఎంతో ప్రయాసపడుచున్నాము. దానిలో కనీసము పదోవంతు ప్రయాసము, ఆసక్తి చూపిన సంఘము ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. ప్రతి క్రైస్తవుడు ఆత్మ విమర్శ చేసికొని సంఘము అభివద్ధి చెందుటకు పాటు పడవలయును.

- డి. జీవానందం, మౌలాలి.

(సత్యవాక్యములు సౌజన్యంతో)

## కలిగి యుండుట
(అపొ.కా. 3:6)

1. మానవుడు ఆస్థిని కలిగియుంటాడు :- బైబిలునందు ఆదికాండము 12:5 మరియు 13:6,7 వచనములలో చూస్తే అబ్రాహాము విస్తారమైన ఆస్థిని కలిగియున్నట్లు మనం గమనించగలము. యోబు కూడా విస్తారమైన ఆస్థిని కలిగియున్నట్లు మనము గమనించగలము (యోబు 1:3). ఈ ఇద్దరు వ్యక్తులను మనం గమనించినప్పుడు వారు దేవుని తమ జీవితములలో కలిగి యున్నారు కాబట్టి ఆస్థిని కలిగియున్నారు. అపొ.కా. 3:6 వచనమును మనం గమనించినచో "పేతురు నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను" అని చెప్పియున్నాడు. పేతురు ఏమి కలిగియున్నాడు ? యేసు నామమును దానియందలి శక్తిని కలిగి యున్నాడు.

ప్రియ చదువరీ నీవు నీ జీవితములో యేసును కలిగి యున్నావా ? లేనట్లైతే ఇప్పుడే బాప్తిస్మము పొందుట ద్వారా యేసును కలిగియుండు. ఈ లోకములో ఎక్కువమంది ఆస్థిని కలిగియుంటారు కానీ యేసును తమ జీవితాలలో కలిగి యుండరు. కాబట్టి నీ జీవితములో యేసును కలిగియుండు.

2. మానవుడు ఈ లోక జ్ఞానమును కలిగియుంటాడు :- ఎక్కువమంది ఈ లోకజ్ఞానము కొరకు ప్రాకులాడు చున్నారు. ఒకనాడు ఆధ్యాత్మిక చింతనలో, విరాజిల్లిన మన దేశం ఈనాడు లోకజ్ఞానంతో నిండి, ధర్మాధర్మాలు మరచి, కల్లోలిత ప్రాంతంగా తయారయ్యింది. ఈ రోజులలో, లోకజ్ఞానం కంటే దైవ జ్ఞానం యొక్క ఆవశ్యకత ఎంతైనా వుంది. రాజైన సొలోమోను దైవ జ్ఞానం కలిగి దేశదేశాలలో కీర్తినార్జించినట్లు మనం 1రాజులు 4:30,32లో చదువ గలము. ప్రియచదువరీ ఈ లోకజ్ఞానం మన మనో నేత్రములకు గ్రుడ్డితనం కలుగజేయును కాని దైవజ్ఞానం మనకు ఇహపరములలో కీర్తినార్జించును. మన మనస్సును వికసింప చేయలేని ఈ లోకజ్ఞానం కంటే దైవజ్ఞానమైన వాక్యమును నీ హృదయములో కలిగియుండు. బాప్తిస్మము ద్వారా యేసు ను కలిగియుండు.

3. మానవుడు స్నేహితులను కలిగియుంటాడు :- సాధారణంగా మనం స్నేహితులను కలిగియుంటాం. కానీ వారు ఎటువంటి వారు, మనలను ఏ విధంగా నడిపిస్తున్నారో గమనించం. బైబిలునందు రాజైన సొలోమోను కుమారు డైన రెహాబాము చెడు స్నేహితులను కలిగియుండి ఇశ్రాయేలీయుల పట్ల అనుసరించిన విధానములో పెద్దలు చెప్పిన సలహాను విస్మరించి చెడు స్నేహితులు చెప్పిన వాటిని పాటించి ఇశ్రాయేలు రాజ్యం విడిపోవుటకు కారకుడైనాడు. ఆ కారణంగానే నెబాతు కుమారుడైన యరోబాము సొంత ఆలోచనతో ఇశ్రాయేలీయులను దేవుని సన్నిధికి వెళ్ళకుండా చేసి దూడలను మ్రొక్కించినట్లు మనము 1రాజులు 11,12 అధ్యాయములో చదువగలము. ప్రియచదువరీ నీవు ఎటువంటి స్నేహితుని కలిగియున్నావు ? స్నేహితుడు, ప్రాణప్రియుడు నీ పాపములకొరకు తన రక్తమును చిందించిన యేసుక్రీస్తును నీవు కలిగియున్నావా ? యేసును నీ జీవితములో కలిగియుండు.

4. దుఃఖమును కలిగియుండుట:- ఇటీవల కాలంలో సంభవించిన తుఫాను కారణంగా చాలమంది దుఃఖాన్ని కలిగియున్నారు. కానీ దైవగ్రంధమందు కీర్తనాకారుడు ఈ విధముగా చెప్పుచున్నాడు: “నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను” (కీర్తన 34:4). కీర్తనాకారుని తన దుఃఖము నుండి తప్పించిన దేవుడు మనలను కూడా తప్పిస్తాడు. ఆయనను కలిగియున్నప్పుడు (ప్రక 2:10) ఏలియా మరణాపేక్ష గలవాడై బదరీ వృక్షము క్రింద నుండగా ఆ దుఃఖము నుండి తప్పించిన దేవుడు నిన్నునూ తప్పించును (మత్తయి 5:4). పేతురు, యోహానుల వలే నీ జీవితంలోనూ యేసును కలిగియుండు. అప్పుడు అన్నియు నీకు అనుగ్రహింపబడును” (మత్తయి 6:33).

- పి. ఎస్. నారాయణ, కాకినాడ.

## సంక్షిప్త వార్తలు

1997 ఏప్రియల్ నెల కృష్ణాజిల్లా సువార్తికుల సదస్సు ఏప్రియల్ 25వ తేదీన తిరువూరులో ఘనంగా నిర్వహించబడెను. కృష్ణా మరియు ఖమ్మం జిల్లాలనుండి ఇంచుమించు 160 మంది సువార్తికులు కూడిరాగా, "మానవుని రక్షణ విషయంలో సంఘము యొక్క పాత్ర ఏమైయున్నది" ? యను అంశము చర్చింపబడెను.

ఉదయకాల కూటమునకు సోదరులు K. J. సుదర్శనంగారు (కుంటముక్కల) అధ్యక్షత వహించగా, B. ఆనందరావ్ గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభమాయెను. P. షద్రక్ (గన్నవరం), Ch. కాంతారావ్ (రామచంద్రాపురం), P. దానియేలు (ఇబ్రహీం పట్నం), O. నాగేశ్వరరావ్ (రెడ్డిగూడెం), O. ఆదాము (నూజివీడు) గార్లు చక్కటి వాక్యోపదేశము గావించిరి.

మధ్యాహ్న కాల కూటమునకు సోదరులు G. మార్కు (నందిగామ) గారు అధ్యక్షత వహించగా, K . బాబూరావ్ (తక్కెళ్లపాడు) గారు ప్రార్ధనతో దాన్ని ఆరంభించిరి. సోదరులు K . ఇశ్రాయేలు (కంభంపాడు), P . సురేంద్రకుమార్ (మణుగూరు), K . జోసఫ్ (పెడన), P . అబ్రహాం (ముత్యాలపాడు-విజయవాడ), N. K. Y. దాస్ (ఇబ్రహీంపట్నం), సత్యానందం (కల్లూరు), మరియు నెహెమ్యా గూటం (కాకినాడ) గార్లు చక్కటి వాక్యోపదేశము గావించిరి.

క్రీస్తు తన స్వరక్త మిచ్చి సంఘమును స్థాపించెను. ఈ లోకంలో ఆయన పని చేయు నిమిత్తము సంఘమునకు గొప్ప బాధ్యత అప్పగించెను. మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యను గొప్ప బాధ్యతను ఆయన సంఘమున కిచ్చెను. మరియు దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున సంఘము ద్వారా తన యొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియజేయబడవలెనని ఉద్దేశించెను. దేవుని గూర్చి, క్రీస్తును గూర్చి రక్షణ సంకల్పమును గూర్చి ఉన్నది ఉన్నట్టుగా సత్యమును బోధించే బాధ్యత ఆయన తన సంఘమునకే అప్పగించెను గాని మతశాఖలకు కాదు. అందువలన మానవుని రక్షణ విషయములో దేవుని సంకల్పమును క్రీస్తుసంఘము మానవజాతికంతటికీ బోధింప బాధ్యురాలై యున్నది. రక్షణ క్రీస్తులో యున్నది.

సంఘము రక్షించదు. గాని ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తు సంఘములో యుండాలి. ఏలయనగా రక్షింపబడినవారే క్రీస్తు సంఘమై యున్నారని సోదరులు ఉద్ఘాటించిరి.

తిరువూరు స్థానిక సంఘము, అక్కడి సువార్తికులు ఇందుపల్లి ఇశ్రాయేలు గారు హాజరైనవారికి గొప్ప ఆతిధ్యమిచ్చిరి. వచ్చిన వారందరు గొప్పగా ప్రోత్సాహించబడిరి. సోదరులు K. రాజకుమార్ (దుర్గాపురం) గారి ప్రార్ధనతో సదస్సు విజయవంతముగా నాటి సాయంత్రం ముగిసెను.

మేనెల 4వ తేదీ ఆదివారం శ్రీకాకుళం బందీలపురంలో యున్న క్రీస్తు సంఘ ప్రార్ధనా స్థలమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి తెరిచిరి. బందీలపురంలో సోదరులు R. విజయానందరావ్ గారు యిదివరలో నిర్మించుకొనిన యింటి పై అంతస్థులో కొంత భాగమును ఆరాధనా స్థలముగా కేటాయించిరి. విజయానందరావ్ గారు, స్థానిక సంఘము ఆహ్వాన పత్రికలు ముద్రించి పలువురు క్రీస్తు సంఘ సువార్తికులను ఈ కార్యక్రమమునకు ఆహ్వానించిరి. ఆ రోజు ఆరాధనా కార్యక్రమము చక్కగా జరిగెను. విజయానందరావ్ గారు ప్రభుత్వ ఉద్యోగం చేసుకొనుచు దేవుని సేవ చేయుట ముదావహము. అదే రోజున శ్రీకాకుళం టౌన్‌లో యున్న క్రీస్తు సంఘ ఆరాధనలో అమెరికా నుండి వచ్చిన సోదరులు చార్ల్స్ స్కాట్ గారు పాలుపొంది వాక్యోపదేశము గావించిరి. అక్కడ R. Ch. సద్గుణరావ్ గారు సువార్తికులుగా యుంటూ సంఘమును ఆత్మీయముగా నడిపించుచున్నారు. ఆ రాత్రి శ్రీకూర్మాంలో ఏర్పాటు చేయబడిన కూటములో స్కాట్ గారు, జాషువా గారు పాల్గొనిరి.

మేనెల 7,8 తేదీలలో కాకినాడ సత్యవాణి భవనములో గొప్ప సువార్తికుల సదస్సు జరిగెను. ప్రతీ దినము ఇంచుమించు 250 మంది హాజరైరి. దీనిలో ముఖ్య అతిధిగాను ప్రసంగీకునిగాను సోదరులు చార్ల్స్ స్కాట్ గారు పాల్గొనిరి. మరియు E.K.V.ప్రసాదరావ్ (చెయ్యేరు),G .శ్యాంప్రసాద్ (దేశినేనిపాలెం),G .మార్కు (నందిగామ), M . సామ్యూల్‌రాజు(బిక్కవోలు), P. ప్రకాశం (హైదరాబాదు) T.జ్ఞానానందం (కాకినాడ) మరియు చుక్కా అప్పారావ్ (రాయుడుపాలెం) గార్లు వాక్యోపదేశం గావించి సోదరులను ప్రోత్సాహించిరి. N . ఎబినేజర్ (నిజామాబాద్) R. Ch.సద్గుణరావ్ (శ్రీకాకుళం) గార్లు చక్కటి పాటలను నేర్పించి నడిపించిరి. సోదరులు T.V.N. కుమార్, G . శ్యాంప్రసాద్, R. Ch. సద్గుణరావ్ గార్లు స్కాట్ గారి

ఆంగ్లోపన్యాసమును సమర్ధవంతముగా తెలుగున కనువదించి సహాయపడిరి. ఆ రెండు రోజులలోను పలు జిల్లాలనుండి వచ్చిన సోదరులు క్రైస్తవ సహవాస ప్రేమలలోని గొప్ప మాధుర్యాన్ని చవిచూచి ప్రభువును స్తుతించిరి.

మే నెల 10వ తేదీ సాయంత్రం గొల్లవిల్లిలో సోదరులు పాల్‌గూటం గారు ఏర్పాటు చేసిన కృతజ్ఞత కూటములో స్కాట్ గారు, జాషువా గారు పాల్గొని, స్థానిక సంఘముతోను, పాల్ గారి కుటుంబముతోను పాల్ గారికి దేవుడు అనుగ్రహించిన స్వస్థత కొరకు ఆరోగ్యము కొరకు, శస్త్రచికిత్సలో సహాయపడిన వారందరి కొరకు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించిరి.

మేనెల 15వ తేదీ మధ్యాహ్నం జగన్నాధగిరిలో సోదరులు P . ప్రకాశం (హైదరాబాదు) దంపతుల యొక్క 50వ వైవాహిక వార్షికోత్సవము ఘనంగా జరిగెను. సోదరులు ప్రకాశం గారి బిడ్డలు, అల్లుళ్లు, మనుమలే గాక అనేకమంది బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ఆ సంతోష కార్యక్రమములో పాల్గొనిరి. నెహెమ్యా గూటం గారు ఆయన సతీమణితోను, జాషువాగూటం గారు కూడా ఆయన సతీమణితోను ఇందు పాల్గొని అందరితో సహా ప్రకాశం దంపతులకు ఇంకొక 50 సంవత్సరముల ఆనందదాయక జీవితాన్ని, ఫలప్రదమైన సేవను దేవుడు ప్రసాదించునట్లు అభినందించిరి.

మే నెల 22వ తేదీ గురువారం నాడు మెట్టలంక గ్రామములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి తెరచిరి. ఈ నూతన ఆలయ ప్రవేశ కార్యక్రమములో సోదరులు ఇ.కె.వి. ప్రసాద్, ఎన్.ఏలియా, డి.ఇశ్రాయేలు రాజు మరియు అనేకమంది బోధకులు పాల్గొనిరి. కూటం అనంతరం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మెట్టలంకలో సోదరులు విత్తనాల వీరరాఘవులు గారు క్రీస్తుకొరకు గొప్పగా శ్రమించుచు అనేక ఆత్మలను సంపాదించుచున్నారు. గత నవంబరులో సంభవించిన తుఫానులో మెట్టలంక సోదరులు సమస్తమును కోల్పోయినను, ముందుగా ఆలయ నిర్మాణము చేపట్టి ముగించగల్గిరి. అందుకై ప్రభువుకు స్తోత్రము.

ముఖ్య గమనిక : మీ అడ్రస్‌లో మార్పు వచ్చినప్పుడు మాకు వెంటనే తెలియజేయండి. సత్యవాక్కు పత్రికపై యున్న మీ అడ్రస పై నున్న నంబరును తప్పక వ్రాయండి. ఆ నంబరు లేనిదే మీ అడ్రసును మార్చుటకు వీలుపడదు. ఇప్పుడు సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా తొమ్మిది వేల గృహాలను దర్శించుచున్నది.

మీ బంధువులు, మిత్రులు బేసిక్ బైబిలు కోర్సులో చేరేటట్లు చేయండి. వారి అడ్రసులను మాకు సంపితే వారికి పోస్టు ద్వారా బైబిలు పాఠములను ఉచితముగా పంపించెదము. బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన వారికి ఒక బైబిలు ఇప్పుడు బహుమతిగా ఇయ్యబడుచున్నది.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

From:
SATYA WAKKU
P.O. BOX 80
KAKINADA - 533 001

To